


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -153-

**(23 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ప్రతి విషయాన్ని** కర్మకు తీసుకుపోయి అంటకట్టడం కొందరికి బాగా అలవాటు. కొందరు "కర్మాలేదు గిర్మా లేదు, అదంతా వట్టి మర్మం. అలా ప్రతి విషయాన్ని కర్మ దృష్ట్యా చూడటం అలవాటు చేసుకున్న వారి కళ్ళకు మంచి రకం 'సుర్మా' పెట్టాలి" అని విమర్శిస్తూ వుంటారు.

"కర్మ గొప్ప ఫర్మానా లాటిది. దాన్ని తప్పించుకోవడం ఎవడి తరంకాదు. అది అలా అనుభవించి తీరవలసిందే. దాన్నించి తప్పించుకోవడం ధాతవశంకాదు" అని చాలామంది చెపుతూ ఉంటారు.

"ఖర్మకొద్దీ సంతానం" అంటూ వుంటారు. ఒక్క సంతానమన్నమాటేమిటి? సర్వం కర్మవశమేననే సత్యంకూడా గోచరిస్తూ ఉంటుంది కొంచెం విధానంగా ఆలోచిస్తే.

"మీరు నా కర్మకొద్దీ దొరికారండీ" అని భార్య గౌరవ పురస్పరంగా భర్తను దులుపుతూ పుట్టే "కర్మకొద్దీ కాకపోతే నేను వచ్చి వచ్చి ఈ సంసారంలో పడటమేమిటి?" అని భర్త అనేకమాట్లు ప్రశ్నించుకుంటూ వుంటాడు. జవాబు దొరకదనే నైరాశ్యం కళ్ళల్లో కనిపిస్తుండగానే.

ఏవో బాధల్లో వుండో, బ్రతుకులో పట్టు తప్పో యోగుల వద్దకు, మహనీయుల వద్దకూ వెళ్ళినప్పుడు "నేను మాత్రం కర్మలను తప్పించగలనా? వాటిని తట్టుకునే ధైర్యం కొంతవరకు బోధించగలను గాని. రుగ్మతం మొదలైనవి కర్మల క్రిందనే కనబడతాయి. నాకు మాత్రం లేవా ఇలాటి రుగ్మతలు?" అంటూ వుంటారు.

కనుక కర్మ అనేది వుందనీ, అది బ్రతుకుల్ని పట్టుకునే తిరుగుతుందనీ మనకు స్పష్టమవుతుంది. ఇంకా కొంచెం వేదాంతంలోకి పోతే జీవితమే కర్మ. కర్మను బట్టి జీవితం అనే సత్యం అవగతమవుతుంది.

మొన్న ఒక మిత్రుడు వచ్చాడు అతడు కర్మని గురించి మాట్లాడటం ప్రారంభించాడు. "కర్మ తప్పించటం ఎవరి వశంకాదోయ్. కర్మలు తప్పించము, కరుణతో బ్రోవమని చాలామంది భక్తులు భగవంతుణ్ణి ప్రార్థిస్తూ వుంటారు ఆశకొద్దీ. కాని దానివల్ల ప్రయోజనం ఎంతమాత్రం వుండదుట" అన్నమాట.

"అదేమిటి భగవంతుడు కూడా తప్పించలేకపోవడమేమిటి? మహాశక్తి సంపన్నుడు, లోకరక్షాదక్షుడూ అయిన ఆ భగవంతుడు తప్పించలేకపోవడమేమిటి? ఆయన చేతిలో చక్రం వుందికదా! దానికి తిరుగుతూ వుంటుంది" అన్నాను.

"ఏమిటోయ్ నువ్వు కూడా అలా మాట్లాడతావు. ఆ చక్రం మాత్రం ఎప్పుడు పడితే అప్పుడు తిరుగుతుందనుకున్నావేమిటి? కర్మ పరిపాకం కావాలి. అందాకా అది ఆయన వ్రేలుచుట్టూ తిరుగుతూ వుంటుంది కాని బయలుదేరదు.

"పిల్లలు విష్ణు చక్రం, భూచక్రాలతో ఆడుకుంటూ వుంటారు దీపావళి సందర్భంలో. ఆయనకూడా దాంతో అలాగే ఆడుకుంటూ వుంటాడు. అవతల జీవికి కర్మ పరిపక్వమయేదాక. ఆలాకాకపోతే ఆ చక్రంలోక సంచారం చేస్తూ వుంటుంది కాని, మళ్ళీ ఆయన చేతిలోకి ఎక్కడ వెడుతుంది?" అన్నాడాయన.

"నిజమే నువ్వు చెప్పింది. అయితే భక్తుల ప్రార్ధనలు విని కర్మలో వుండే ఉధృతాల్ని తగ్గిస్తాడా పరాత్పరుడంటారు ఎంతవరకు నిజమో?" అన్నాను.

"ఇలాటివన్నీ ఆలోచించకు. అంత మంచిదికాదు. కర్మ ప్రభావం ఎంతవరకు వుంటుందో, ఎంత పర్సెంటు తగ్గిస్తాడో, ఇవన్నీ ఎవరు చెప్పగలరు? ఒక్కటి మాత్రం మనం నమ్మాలి. కర్మ పూర్తి అయ్యేటప్పటికి ఆయన అనుగ్రహం వెంటనే ప్రాప్తిస్తుంది. ఆయన పరధ్యానంలో వుండి ఒకవేళ చక్రం విసరడం మరిచిపోయినా అది దానంతట అదే పరుగెత్తుకుపోయి దాని పని అది చేసుకుని చక్కా వస్తుంది. ఏవంటావు?" అన్నాడు మిత్రుడు.

"కాదనే అవసరం నాకేం కనిపించడం లేదు" అన్నాను.

"కాదనేదాకా ఎక్కడోయి? ఒక్క ఉదాహరణ చెపుతావిను. కరివదనుడు అన్నారు ఆ హరిని. ఎంతగానో పొగుడుతారు? ఆయా కరుణకు ఉదాహరణగా పేర్కొంటారు. ఆల్‌రైట్ బాగానే వుంది. ఆయన ఎన్నాళ్ళు ఆలోచించి ఆలోచించి చక్రం పంపాడు చావులు తప్పిన తర్వాతనేనా? ఎప్పుడేదైనా కేసు వస్తే ముందు అరెస్టు చేసి తర్వాత విచారణ జరుపుతారు. దాన్నిబట్టి శిక్షో, విడుదలో వుంటుంది. దానివల్ల ఫిర్యాదికి కొంత సంతృప్తి అన్నా వుంటుంది. ఆయన విషయంలో అలాటిదేమీ వుండదు. ఉంటే ఆ మొసల్ని అరెస్టు చేసి పారెయ్యవచ్చుగా అదేంలేదు. కర్మ పరిపాకం వరకూ అలా వదిలివేస్తాడు. ఎంత పాకం ముదిరినా పట్టించుకోడు" అన్నాడు మిత్రుడు.

"నువ్వు చెప్పింది నిజం. అలాగే జరుగుతూ వుంటుంది ఆయన సందర్భంలో" అన్నాను.

"అది నిజం ఆయనగారు ఎవరి కర్మలు వారికి అంటకట్టి హాయిగా కూర్చుంటాడు. సత్కర్మల డిపార్టుమెంటు వేరు. దుష్కర్మల డిపార్టుమెంటు వేరు. కర్మలు ఉటంకించబడిన ఎడ్రస్సు కార్డులుంటాయి ఆయన దగ్గిర వాటి మీదో ముద్ర తగిలించి ఎప్పటివరకు అమలులో వుంటాయో ఆ డేట్లు నమోదు చేసి బట్వాడా చేసి వూరుకుంటాడు.

"అదో పెద్ద పోస్టాఫీసు. ఆయన పి.యం.జి. మనం ఆయన్ని అనేం లాభం?" అన్నాడు మా మిత్రుడు.

"కర్మ సిద్ధాంతాన్ని చక్కగా పరిశీలించినట్లున్నావే. ఇదివరకు వట్టి కవిత్వం విషయమే మాట్లాడేవాడివి. ఇప్పుడు వేదాంతంలోకి కూడా వెళ్తున్నావు. ఎప్పటినుంచి వచ్చింది నీలో మార్పు. ఎలా వచ్చింది? " అని ఆశ్చర్యంగా అడిగాను.

"వయస్సు మళ్ళుతోంది. అది ఫస్టు పాయింట్. నమ్మిన వాళ్ళు ద్రోహం చేస్తున్నారు. అది రెండో పాయింట్. పని చేయించుకుని జీతాలు ఎగ్గొడుతున్నారు. అది మూడో పాయింటు. అడ్డమైన వాళ్ళ దగ్గరికి అప్పుకోసం వెళ్ళాల్సివస్తుంది. అది నాలుగో పాయింటు. ఇక కర్మ సిద్ధాంతం వంటపట్టక ఏం చేస్తుందోయ్" అన్నాడు.

నిజమేనన్నాను ఏ మాత్రం ఆలోచించకుండా.

"అసలు భగవంతుడే కర్మబద్ధుడు. ఆ విషయం ఈసారి వచ్చినప్పుడు మాట్లాడుదాం" అని వెళ్ళిపోయాడు.

Post your comments